Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

శుక్రవారం, జూలై 4, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## యూపీ, కేరళ విద్యార్థులతో శుభాంశు మాటామంతీ

లక్నో/తిరువనంతపురం: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోని భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లాతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి కేరళ, ఉత్తరప్రదేశ్ పాఠశాల విద్యార్థులు అత్యంత అరుదైన, మాటల్లో చెప్పలేని అనుభూతిని పొందారు. భారరహిత స్థితిలో స్వేచ్ఛగా గాల్లో కదలాడుతూ బంతితో ఆడుకుంటున్న శుక్లాను చూసి ఆ విద్యార్థులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. పట్టరాని ఆనందంతో పదే పదే ప్రశ్నలు సంధించారు.





# ప్రపంచ దేశాలతోనే పోటీ

### తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామం: సీఎం రేవంత్

### పెట్టుబడిదారులకు, వారి ఆస్తులకు పూర్తి రక్షణ లభిస్తుంది

### మలబార్ బంగారు, వజ్రాభరణాల తయారీ సంస్థ ప్రారంభం

రంగారెడ్డి : 'అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉత్పత్తుల ఎగుమతి విషయంలో మాకు దేశంలోని ఏ రాష్ట్రంతోనూ పోటీ లేదు. అమెరికా, సింగపూర్, కొరియా, యూకే వంటి అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతోనే మాకు పోటీ ఉంటుంది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై సహా దేశంలోని ఏ ఒక్క నగరం కూడా మన హైదరాబాద్‌తో పోటీ పడలేదు..'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలోని పారిశ్రామిక జనరల్ పార్క్‌లో 3.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మలబార్ బంగారు, వజ్రాభరణా ల తయారీ సంస్థను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా

(మిగతా 2వ పేజీలో)

# తెలంగాణ హైకోర్టుకు కొత్త జడ్జీలు

### నలుగురిని సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

### గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు,

### వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ ఎంపిక

### న్యాయవాదుల కోటా నుంచే వారికి అవకాశం



హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తులు రానున్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం వారి నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. న్యాయవాదులు గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌లను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా సిఫార్సు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో 26 మంది న్యాయమూర్తులున్నారు. ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేసిన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తోపాటు జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ సుమలతలను తెలంగాణకు బదిలీ చేస్తూ గత నెల

(మిగతా 2వ పేజీలో)

## చెప్పినట్టే చేశా

సీనియర్ ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్



## పైరసీ నియంత్రణకి కఠిన చర్యలు: 'దిల్' రాజు





## నేడు సామాజిక న్యాయ సమరభేరి

# ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించింది ఏం లేదు

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై కెటిఆర్ ఫైర్

### ప్రతిపక్షనేతగా ఏడాది పూర్తి చేసుకుంటున్నా..

### తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఏనాడూ

### నిలదీయలేదని ఆగ్రహం బనకచర్లపై మౌనం

### కుట్రలో భాగమేనని విమర్శ రాష్ట్ర ప్రాజెక్టులకు

### జాతీయ హోదాపై కేంద్రాన్ని ప్రశ్నించలేదని నిలదీత



హైదరాబాద్: ఎంత పెరిగినా గొర్రెకు బెత్తెడే తోక అన్నట్టు ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించింది ఏం లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. లోక్‌సభలో ప్రతి పక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్ గాంధీ, తెలంగాణ సమస్యలు, ఈ ప్రాంతానికి హక్కుగా రావాల్సిన అంశాల మీద ఏ రోజు కూడా మాట్లాడలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో బిజెపితో రాహుల్ గాంధీ కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాహుల్ మౌనంగా

(మిగతా 2వ పేజీలో)



## కెసిఆర్‌కు అస్వస్థత

### యశోద ఆసుపత్రిలో కెసిఆర్‌కు వైద్య పరీక్షలు

### కెసిఆర్ ఆరోగ్యం నిలకడగానే ఉంది: యశోద వైద్యులు

హైదరాబాద్: బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు గురువారం సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల కోసం తన సతీమణి శోభ, కుమారుడు కెటిఆర్‌తో కలిసి కెసిఆర్ యశోద ఆసుపత్రికి వెళ్లారు. బిఆర్ఎస్ పార్టీ నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్ కూడా ఆసుపత్రికి వెళ్లారు. కెసిఆర్‌కు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇది కేవలం రెగ్యులర్ హెల్త్ చెకప్‌లో భాగమేనని తెలిపారు. కాగా, కొద్ది రోజుల క్రితం జనరల్ హెల్త్ చెకప్‌లో భాగంగానే కెసిఆర్ గచ్చిబౌలిలోని

(మిగతా 2వ పేజీలో)

# కెసిఆర్ అసెంబ్లీకి రావాలి

### అన్ని అంశాలపై చర్చలు జరుపుతాం

### ప్రతిపక్షనేతగా ఆయన ఇచ్చే సలహాలు, సూచనలు స్వీకరిస్తాం

### కెటిఆర్‌తో మాకు సంబంధం లేదు

### హరీశ్ ఎవరో నాకు తెలియదు హ్యామ్‌రోడ్ల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు

### రూ.350కోట్లతో అప్రోచ్ రోడ్లు మూడేళ్లలో ఆర్ఆర్ఆర్ పూర్తి

### రోడ్లు,భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్ : కెసిఆర్ అసెంబ్లీకి రావాలని, ఆయన వస్తే అన్ని అంశాలపై చర్చ జరుపుతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హరీష్ రా వు, కెటిఆర్‌తో తమకు సంబంధం లేదని వాళ్లు లెక్కలోకి రారని, కెసిఆర్‌తోనే తమకు లెక్క అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అ న్నారు. కెసిఆర్, తాము ఉద్యమంలో పనిచేశామని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ఆయన అన్నారు. హరీష్ రావు ఉత్తి ఎమ్మెల్యే మాత్రమే అని, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కాదని కోమటిరెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేతగా కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి తమ తప్పు, ఒప్పులను చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశా రు. కెసిఆర్ సలహాలు ఇస్తే స్వీకరిస్తామని, తప్పులను చూపిస్తే సరిదిద్దుకుంటామని ఆయన పేర్కొన్నారు. కెసిఆర్‌తోనే తమకు లెక్క అని హరీష్ రావు ఎవరో తనకు తెలియదని ఆయన అన్నా రు. గురువారం ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బి కార్యాలయం లో హ్యామ్ రోడ్ల ప్యాకేజీపై మంత్రి



(మిగతా 2వ పేజీలో)

# ప్రపంచ దేశాలతోనే పోటీ

సీఎం మాట్లాడారు. 'తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామం. ఇక్కడ పెట్టుబడి పెట్టిన వారికి, వారి ఆస్తులకు పూర్తి రక్షణ లభిస్తుంది. గత 20 ఏళ్లలో పాలకులు మారారే కానీ.. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఆయా ప్రభుత్వాల విధానాలు మాత్రం మారలేదు. మేం పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకెళ్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి దారులను కడుపులో పెట్టి చూసుకుంటుంది. ఇక్కడ పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు ఆర్జించొచ్చు.

**కొనుగోళ్లలో తెలుగు మహిళల ముందంజ**

బంగారు, వజ్రాభరణాల కొనుగోలు విషయంలో ఇతర రాష్ట్రాల మహిళలతో పోలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల మహిళలే ముందుంటారు. ఆ తర్వాతి స్థానంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల మహిళలు ఉంటారు. బంగారు ఆభరణాల తయారీకి మహేశ్వరం అనువైన ప్రదేశం. ఇక్కడ దేశంలోనే అతిపెద్ద యూనిట్‌ను ఏర్పాటు చేయడం అబినందనీయం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహేశ్వరం, ముచ్చర్ల, బేగరి కంచె కేంద్రంగా 30 వేల ఎకరాల్లో భారత ఫ్యూచర్ సిటీని తీర్చి దిద్దబోతున్నాం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే కాదు వారికి లభాలు చేకూరేలా ప్రభుత్వం సహకరిస్తుంది..'అని సీఎం హామీ ఇచ్చారు.

**తయారీ రంగానికీ హబ్‌గా మార్చేందుకు కృషి: శ్రీధర్‌బాబు**

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఐటీ, ఫార్మా రంగాల మాదిరే తయారీ రంగానికీ తెలంగాణను హబ్‌గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తయారీ రంగం గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) 2022-23లో రూ.1.34 లక్షల కోట్లు ఉండగా, 2023%-%24లో 9 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. తెలంగాణ జీఎస్‌డీపీలో తయారీ రంగం వాటా 19.5 శాతం ఉండగా, జాతీయ స్థాయిలో ఇది 17.7 శాతమే ఉందని చెప్పారు. తెలంగాణ తయారీ రంగ ఎగుమతులు రూ.1.2 లక్షల కోట్ల మార్కు దాటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, ఐటీ, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు సామాజిక న్యాయ సమరభేరి

హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నిక ల్లో గెలుపే లక్ష్యంగా కేడర్‌కు ఏఐసిసి అధ్యక్షుడు ఖర్గే దిశానిర్దేశం చేయనున్నారు. ఈ నేపథ్యంలో నే నేడు ఎల్బీ స్టేడియంలో గ్రామ స్థాయి నేతల సమ్మేళనానికి ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ ఖర్గే సభకు 'సామాజిక న్యా య సమర భేరీగా' కాంగ్రెస్ వర్గాలు నామకరణం చేశా యి. నేడు మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీ స్టేడియంలో ఈ సమ్మేళనం జరుగుతుంది. జైబాపు, జైంభీం, జై సంవిధాన్‌లో భాగంగా ఖర్గే సభ జరుగుతుందని పిసిసి వర్గాలు పేర్కొన్నాయి. ఇంకా ఈ సమావేశానికి ఏఐసిసి నాయకురాలు,పార్టీరాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంఎలు, ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ముఖ్య నేతలు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన అంశాలు, పార్టీ కేడర్‌కు తీసుకోవాల్సిన పటిష్టత గురించి గ్రామ స్థాయి నాయకులకు ఖర్గే సూచనలు చేయనున్నారు. పార్టీ గెలుపు కోసం విభేదాలను విడనాడి గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఖర్గే కేడర్‌కు పలు సూచనలు చేయనున్నారు.

# పైరసీ నియంత్రణకి కఠిన చర్యలు: 'దిల్' రాజు

"చిత్ర పరిశ్రమకి వీడియో పైరసీ అన్నది చాలా నష్టం కలిగిస్తోంది. ఈ పైరసీ నియంత్రణకి కఠిన చర్యలు చేపడుతున్నాం... ఇందుకోసం త్వరలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నాం" అని తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ 'దిల్' రాజు తెలిపారు. ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంకతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ%-% "రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పలు కీలక సమావేశాలు నిర్వహించాం. సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్‌లకు ఆన్‌లైన్ అనుమతులపైనా చర్చించనున్నాం. సినీ పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందరం కలిసి సినీ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది" అన్నారు. "ఇండస్ట్రీ సమస్యలను ఎవరైనా మా దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తాం" అని ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంక హామీ ఇచ్చారు.

# కెసిఆర్‌కు అస్వస్థత

ఎఐజి ఆసుపత్రికి వెళ్లిన విషయం తెలిసిందే. యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెసిఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు గురువారం రాత్రి యశోద ఆసుపత్రి సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎం.వి.రావు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. గురువారం సాయంత్రం స్వల్ప నీరసంతో తమ ఆసుపత్రిలో చేరినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక పరీక్షలలో అధిక బ్లడ్ షుగర్ లెవెల్స్‌తో పాటు తక్కువ సోడియం స్థాయి ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని అన్నారు. మధుమేహం నియంత్రణ కోసం సోడియం స్థాయి పెంచేందుకు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కెసిఆర్ ఆరోగ్యం గురించి సిఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. యశోద హాస్పిటల్ డాక్టర్లు, అధికారులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ చికిత్స అందించాలని ఆదేశించారు. కెసిఆర్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.

## చెప్పినట్టే చేశా

హైదరాబాద్ : ఫార్ములా ఈ కార్ రేస్ నిధుల వ్యవహారంలో అప్పటి మంత్రి కెటిఆర్ చెప్పినట్టే చేశానని, అలాగే ఎఫ్ఇఓ కంపెనీకి నిధులు మళ్లింపులో తన ప్రమేయం లేదని సీనియర్ ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ అవినీతి నిరోధకశాఖ విచారణలో వెల్లడించారు. ఈ కేసులో నోటిసులు అందుకున్న ఎ2 నిందితునిగా ఉన్న అరవింద్‌కుమార్ ఎసిబి విచారణకు హాజరయ్యారు. ఎసిబి విచారణకు అరవింద్‌కుమార్ జనవరిలోనే హాజరైన విషయం తెలిసిందే. కాగా ఇదే కేసులో గత నెల 16న మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎసిబి విచారణకు హాజరయ్యారు. ఆ సందర్భంగా కెటిఆర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా అరవింద్ కుమార్‌ను తాజాగా మరోసారి ఎసిబి అధికారులు క్రాస్ ఎగ్జామినేషన్ చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో అరవింద్ కుమార్ కీలక అంశాలు వెల్లడించినట్టు సమాచారం. ఫార్ములా ఈ రేస్ కార్ నిర్వహించిన సమయంలో మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్ ఆదేశాలతోనే నిధులు విడుదల చేశామని, హెచ్ఎండిఎ ఖాతా నుంచి ఎఫ్ఇఓ కంపెనీకి నిధులు మళ్లింపులో తన ప్రమేయం లేదని అరవింద్‌కుమార్ వెల్లడించినట్టు సమాచారం. ఈ సందర్భంగా కెటిఆర్ మంత్రి హోదాలో సంతకం చేసిన నోట్ ఫైల్ కాపీని ఎసిబి అధికారులకు అరవింద్‌కుమార్ అందజేసినట్టు తెలిసింది. అలాగే మంత్రి హోదాలో కెటిఆర్ స్వయంగా వాట్సప్ ద్వారా ఎఫ్ఇఓకు నిధులు విడుదల చేయాలని ఆదేశించిన అంశాన్ని కూడా ఎసిబి దృష్టికి అరవింద్‌కుమార్ తెచ్చినట్టు తెలిసింది. ఈ అంశంలో వ్యక్తిగత నిర్ణయం కాకుండా బిజినెస్ రూల్స్ పాటిస్తూ, ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని కూడా తాను మంత్రికి సూచించినట్టు అరవింద్‌కుమార్ చెప్పారని తెలిసింది. అయినప్పటికీ తన మాట వినకుండా ఎఫ్ఇఓ కంపెనీకి నిధులు విడుదల చేయాలని మిగతా విషయాలన్నీ తాను చూసుకుంటానని కెటిఆర్ చెప్పినట్లు అరవింద్ కుమార్ వివరించినట్టు తెలిసింది. ఇలా ఉండగా ఎసిబి అధికారులు అరవింద్‌కుమార్‌ను ఆరు గంటల పాటు సుదీర్ఘంగా విచారించింది.

# తెలంగాణ హైకోర్టుకు కొత్త జడ్జీలు

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయాలని కోరింది. కొత్తగా ఎంపికైన వారు నలుగురు, బదిలీపై ఇక్కడికి వచ్చేవారు నలుగురు, ఇక్కడి నుంచి వెళ్లే వారు ఒకరు.. వీరందరి సిఫార్సులకు కేంద్రం ఆమోదం తెలిపితే న్యాయమూర్తుల సంఖ్య 33 (సీజేతో కలిపి)కు పెరగనుంది. ఇంకా 9 ఖాళీలుంటాయి. చాలాకాలం తర్వాత న్యాయవాదుల కోటా నుంచి న్యాయమూర్తులుగా పదోన్నతులు క ల్పించడంపట్ల అడ్వొకేట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



**కొత్త జడ్జీల నేపథ్యాలు ఇవి..**

సుద్దాల చలపతిరావు 1971 జూన్ 25న జనగాంలో జన్మించారు. తండ్రి జగన్‌మోహన్‌రావు. 1998 మార్చి 26న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. వై.రామారావు వద్ద 1998 నుంచి 2004 వరకు జూనియర్‌గా పనిచేశారు. 2004 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సిటి సివిల్ కోర్టులతోపాటు హైకోర్టులో సివిల్, క్రిమినల్ సహా అన్ని విభాగాల కేసుల్లో వాదనలు వినిపించారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సెల్‌గా 2022లో నియమితులయ్యారు. ప్రస్తుతం అవే విధులు నిర్వహిస్తున్నారు.

వాకిటి రామకృష్ణారెడ్డి 1970 సెప్టెంబర్ 14న జన్మించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు స్వగ్రామం. వారిది వ్యవసాయ కుటుంబం. తండ్రి సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా సేవలందించారు. తల్లి గృహిణి. అన్న, చెల్లి ఉన్నారు. 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఎ.అనంతసేన్‌రెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశారు. 2005 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సికింద్రాబాద్, సిటీ సివిల్ కోర్టుతోపాటు తెలంగాణ, ఏపీ హైకోర్టుల్లో వాదనలు వినిపించారు. రాజ్యాంగ, సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, ఫ్యామిలీ, కంపెనీ కేసుల్లో సమర్థులు. ఇప్పటివరకు 1,000 పిటిషన్లకుపైగా దాఖలు చేశారు. 2016%-%17లో తొలి తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈడీ స్టాండింగ్ కౌన్సెల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గౌస్ మీరా మొహినుద్దీన్ 1969 జూలై 15న జన్మించారు. ఆయన హైదరాబాద్ బాలానగర్‌కు చెందిన వారు. తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ హెచ్ఎంటీ మేనేజర్‌గా పనిచేశారు. వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాల నుంచి న్యాయ విద్య పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చదివారు. 1993 మార్చి 17న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి బార్ కౌన్సిల్, తెలంగాణ బార్ కౌన్సిల్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా విధులు నిర్వర్తించారు. సివిల్, రాజ్యాంగంతోపాటు పలు విభాగాల్లో సమర్థ వాదనలు వినిపించారు.

గాడి ప్రవీణ్‌కుమార్ 1971 ఆగస్టు 28న జన్మించారు. ఆయన స్వస్థలం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్. తండ్రి జగన్‌మోహన్‌రావు. కాకతీయ వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ.. ఓయూలో ఎంఎ, ఎల్ఎల్ఎం చదివారు. 1998 నవంబర్ 12న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. హైకోర్టు, అడ్మినిస్ట్రేటివ్, ట్రిబ్యునల్స్, లేబర్ కోర్టులో పలు కేసులు వాదించారు. రాజ్యాంగ, సర్వీస్ మ్యాటర్స్, లేబర్ లా, క్రిమినల్ లా.. పలు విభాగాల్లో నిష్ణాతులు. ప్రస్తుతం హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

# ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించింది ఏం లేదు



ఉం డడం ముమ్మాటికి కుట్రే అని పేర్కొన్నారు. గోదావరి లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను తన గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ధారాదత్తం చేస్తుం టే ఆపకుండా రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 2014 పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు రాహుల్ గాంధీ ప్రశ్నించలేదని గుర్తుచేశారు. కాళేశ్వరం లేదా పాలుమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యా క్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయడం లేదో చెప్పాలని అడిగారు. విభజన చట్టంలో ఉన్న ఐటి ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటిఐఆర్)ను 2015లోనే మోడీ ప్రభుత్వం రద్దు చేస్తే రాహుల్ గాంధీ మాట మాట్లాడకుండా కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికారన్నారు. వరంగల్ ప్రజల చిరకాల కోరిక అయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో కూడా రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరిచిపోలేదని చెప్పారు. బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా తెలంగాణ కొంగు బంగారం సింగరేణి అస్థిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోడీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్ గాంధీ ఏ రోజు కూడా లోక్ సభలో మాట్లాడలేదన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అమలుచేయలేక రేవంత్ రెడ్డి చతికిలపడితే రాహుల్ తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. హామీల అమలుకు తనదే గ్యారంటీ అని గప్పాలు కొట్టిన రాహుల్, ఇప్పుడు తెలంగాణకు రాకుండా ముఖం చాటేశారని ఆరోపించారు. ఎన్నో ఆశలతో కాంగ్రెస్‌ను గెలిపించిన తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ ఇచ్చిన శాపం రేవంత్ సర్కార్ అని కెటిఆర్ మండిపడ్డారు. పలికారన్నారు. వరంగల్ ప్రజల చిరకాల కోరిక అయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో కూడా రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరిచిపోలేదని చెప్పారు. బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా తెలంగాణ కొంగు బంగారం సింగరేణి అస్థిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోడీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్ గాంధీ ఏ రోజు కూడా లోక్ సభలో మాట్లాడలేదన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అమలుచేయలేక రేవంత్ రెడ్డి చతికిలపడితే రాహుల్ తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. హామీల అమలుకు తనదే గ్యారంటీ అని గప్పాలు కొట్టిన రాహుల్, ఇప్పుడు తెలంగాణకు రాకుండా ముఖం చాటేశారని ఆరోపించారు. ఎన్నో ఆశలతో కాంగ్రెస్‌ను గెలిపించిన తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ ఇచ్చిన శాపం రేవంత్ సర్కార్ అని కెటిఆర్ మండిపడ్డారు.

# కెసిఆర్ అసెంబ్లీకి రావాలి

సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ట్రాఫిక్ రద్దీగా ఉన్న రోడ్లను గుర్తించి ప్రాధాన్యత క్రమంలోనే హ్యామ్ మోడల్‌లో రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన ట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. సిఎంతో చర్చ జరిపి ఈ నెలాఖరు వరకు 15 ప్యాకేజీల వరకు సెప్టెంబర్‌లో పనులు మొదలు పెట్టాలని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో హ్యామ్ మోడల్ రోడ్లు వేశారని, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే రూ.6వేల 500 కోట్లను రోడ్ల కోసం విడుదల చేశామని ఆయన తెలిపారు. రూ. 15వందల కోట్లతో అప్రోచ్ రోడ్లు లేకుండా గ్రామాలకు లింక్ బ్రిడ్జిలను గత ప్రభుత్వం కట్టిందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రూ. 350 కోట్లతో అప్రోచ్ రోడ్లను వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. సింగిల్ రోడ్లను సైతం పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. వచ్చే ఎన్నికల నాటికి పెండింగ్ రోడ్లు, హ్యామ్ రోడ్లను పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలుస్తామని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. హ్యామ్ రోడ్లపై ముఖ్యమంత్రి సలహా తీసుకొని త్వరలో టెండర్‌లను పిలుస్తామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. హ్యామ్‌రోడ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ఆగస్టు నెలాఖరు వరకు అగ్రిమెంట్ పూర్తి చేస్తామని, సెప్టెంబర్‌లో పనులు మొదలు పెడతామని ఆయన వెల్లడించారు. హ్యామ్ రోడ్లతో రాష్ట్ర రూపు రేఖలే మారిపోతా యని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. 40:60 శాతం ప్రకారం హ్యామ్ రోడ్లు ఎన్‌హె చ్‌ఏ మోడల్‌లో అందుబాటులోకి రాబోతున్నాయని, హ్యామ్ రోడ్లలో టోల్ ప్రసక్తి లేదని కేవలం రెండు రూట్‌లలో మాత్రమే టోల్ ప్రపోజల్ ఉందని కోమటిరెడ్డి తెలిపారు. హ్యామ్ పద్దతిలో రోడ్ల నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేస్తామని, నాలుగు లైన్ల రోడ్లను 6 లైన్లుగా మార్చడం వల్ల ప్రక్రియ ఆలస్యం అవుతోందని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

**ఆర్‌ఆర్‌ఆర్‌పై ప్రధాని మోడీని, కేంద్రమంత్రి గడ్కరీని కలుస్తా**

రోడ్డు ప్రమాదాల ద్వారా మృతి చెందే వారి సంఖ్య ప్రపంచంలోనే ఇండియా మొదటిదని అందులో తెలుగు రాష్ట్రాలు సైతం మొదటి స్థానాల్లో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. విజయవాడ రూట్‌లో యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని అక్కడ పనులను చేపట్టామని ఆయన తెలిపారు. కెసిఆర్ కాంట్రాక్టర్లకు రూ. 3,400 కోట్ల రూపాయల బకాయిలు పెట్టి వెళ్లిపోయారని గడిచిన ఐదేళ్లుగా ఒక్క రోడ్డు కూడా వేయలేదని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ట్రిపుల్‌ఆర్‌పై నితిక్ గడ్కరీ, ప్రధాన మంత్రిని కలుస్తానని ట్రిపుల్ ఆర్ కోసం 96 శాతం భూమిని సేకరించామని, టెండర్లు పిలుస్తామని మంత్రి పేర్కొన్నారు. సదరన్ పార్ట్ ట్రిపుల్ ఆర్ ప్రాసెస్ త్వరలోనే మొదలు పెడతామని, రీజనల్ రింగ్‌రోడ్డును మూడేళ్లలో పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఆరు లైన్ల రోడ్డు కోసం త్వరలో కేబినెట్ ఆమోదం లభిస్తుందన్నారు. టెండర్ ప్రక్రియ వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఓఆర్‌ఆర్ నిర్మాణం రాజశేఖర్ రెడ్డి హయాంలో పూర్తి అయ్యిందని, ఆర్‌ఆర్‌ఆర్‌తో హైదరాబాద్ రూపురేఖలే మారిపోతాయని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత రావు, ఈఎన్సీ జయ భారతి, సీఈలు మోహన్ నాయక్, లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి పలువురు ఎస్ఈలు, ఈఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత పౌర పురస్కారం

భారత ప్రధాని మోడీకి ఘనా దేశపు అత్యున్నత పౌర పురస్కారం అందించారు. ఘనా దేశపు నక్షత్ర స్థాయి గౌరవ హోదాను ప్రధాని మోడీ విశిష్ట రాజనీతిజ్ఞత , ప్రపంచ స్థాయిలో ఆయన నాయకత్వానికి ఉన్న గుర్తింపు క్రమంలో ఈ పురస్కారం ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రెసిడెంట్ నుంచి ఆయన ఈ గౌరవం స్వీకరించారు. ఈ గౌరవం తనకు సవినయపూర్వక గర్వకారణం అని, దీనిని స్వీకరిస్తున్నానని మోడీ తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల తరపున ఈ స్టార్ అవార్డును అందుకుంటున్నట్లు తెలిపారు. ఇరుదేశాల యువత ఉజ్వల భవితకు వారి ఆకాంక్షలకు దీనిని అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ గౌరవంతో తన బాధ్యత పెరిగిందన్నారు. మరింత బలోపేత ఇండియా ఘనా బంధం కోసం అంకిత భావంతో ముందుకు సాగుతానని వెల్లడించారు. ఘనా ప్రజానీకానికి, వారి ఆదరణకు, ఇక్కడి ప్రభుత్వానికి తన కృతజ్ఞతలు అని చెప్పారు. ఘనా విశిష్ట పురస్కారం ఇంతకు ముందు క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా, కోఫి అన్నన్ , కింగ్ ఛార్లెస్ 3 వంటి వారికి దక్కింది.

# 11కు చేరిన హిమాచల్ మృతుల సంఖ్య

హిమాచల్ ప్రదేశ్‌లో ఆకస్మిక వరదల మృతుల సంఖ్య ఇప్పుడు 11కు చేరింది. మండీ జిల్లాలో వర్షాలు, ఆకస్మిక వరదల ఘటనల మరో ఆరు మృతదేహాలను కనుగొన్నారు. దీనితో మొత్తం మృతుల సంఖ్య పెరిగిందని అధికారులు బుధవారం తెలిపారు. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ వరదలలో దెబ్బతిన్న స్యాతి గ్రామం సందర్శించారు. బాధితులకు భారీ స్థాయి సహాయ పథకం ప్రకటించారు.



# టా ప్ర ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న టా ప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్



హుజురాబాద్ జూలై 3 (వాయిస్ టుడే): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో సైదాపూర్ రోడ్డు లోని స్థానిక వెంకటేశ్వర మ్యారేజ్ బ్యూరో కార్యాలయంలో ఇటీవల ఉపాధ్యాయునిగా పదవీ విరమణ పొందిన భారత ప్రభాకర్ ను టా ప్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శనిగరం నరేందర్, చీకట్ల సమ్మయ్య ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న టా ప్రా కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణాచారి మాట్లాడుతూ గత 30 సంవత్సరములుగా ఉపాధ్యాయునిగా, రిసోర్స్ పర్సన్ గా భావిభారత పౌరులైన విద్యార్థినీ విద్యార్థులకు ఉత్తమ సేవలను అందించిన భారత ప్రభాకర్ ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుండా, ఏప్రిల్ 2024 నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇప్పటివరకు గ్రాట్యుటీ, కమ్యూ టేషన్ చెల్లించకపోవడం విచారించదగ్గ విషయమని అన్నారు. అదే విధంగా ఐదు డి ఏ లకు గాను ఒకటే డి ఏ ను మంజూరు చేసి,జూలై 2023 నుండి నూతన పి ఆర్ సి ని అమలు చేయకుండా తాత్సారం చేయడం గ్రహించదగ్గ విషయమని, వెంటనే మిగతా డీఏలను విడుదల చేస్తూ,నూతన పి ఆర్ సి ని జూలై 2023 నుండి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. పెన్షనర్స్, ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ స్కీమును తక్షణమే అమలుపరుస్తూ, పెన్షనర్ల ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో జిల్లా ఉపాధ్యక్షులు బొంగోని వెంకటయ్య, రావికంటి రామకృష్ణయ్య, హుజురాబాద్ శాఖ కోశాధికారి మండల వీరస్వామి,ఉపాధ్యక్షులు చొ ల్లేటి మల్లారెడ్డి జమ్మికుంట శాఖ అధ్యక్షుడు గరిగే చంద్రయ్య, సంఘ బాధ్యులు తాటిపాముల కనకయ్య, తౌటం శ్రీహరి,దొంత హరికిషన్, గుడిపాటి స్వామి రెడ్డి,కంది రాజిరెడ్డి,గాజర్ల బుచ్చిరాజం, పెద్ద పేట రమేష్,గాజ గంగయ్య, కుసుమ మల్లయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి నారు.

# మహిళలకు పురుషులతో సమానంగా కూలి ఇవ్వాలి

## వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం

సూర్యాపేట: పురుషులతో సమానంగా మహిళలకు కూలి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో అడ్డ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ రంగంలో పనులు దొరకక పోవడంతో అనేకమంది సూర్యాపేటకు వచ్చి అడ్డ మీద కూలీలుగా జీవిస్తున్నారని అన్నారు. సుతారి పనులకు వెళుతున్న మహిళలకు కూలి ఇచ్చే దగ్గర పురుషులతో సమానంగా ఇవ్వకుండా కేవలం 600 రూపాయలు మాత్రమే కూలి ఇస్తూ శ్రమ దోపిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులకురూ. 800 వందల నుండిరూ. 900 వరకు ఇస్తున్నారని పురుషులతో సమానంగా పనిచేస్తున్న మహిళ కూలీలకు కూలి తక్కువగా ఇవ్వడంలో అర్థం లేదన్నారు. మహిళ కూలీలకు పని ప్రదేశంలో లైంగిక వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కూలీలు పద్మ, రాణి, ఎల్లమ్మ, కౌసల్య, రాములమ్మ, జ్యోతి, వెంకటమ్మ పాల్గొన్నారు.



# సంక్షోభంలో పండ్ల తోటల రైతులు!


## మార్కెట్ ,నర్సరీ ,కోల్డ్ స్టోరేజ్ లేక అవస్థలు!! పండ్లకు మద్దతు ధర ప్రకటించాలి!

## ఉద్యానవన శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి!!

## సూర్యాపేటలో మామిడి ,నడిగూడెంలో నిమ్మ మార్కెట్ ఏర్పాటు చేయాలి!

## ఫలసాగర్ పథకాన్ని పునరుద్ధరించాలి! వాతావరణ ఆధారిత భీమా ద్వారా ఆదుకోవాలి!

కోదాడ : జూలై 3(వాయిస్ టుడే ప్రతినిధి). తెలంగాణ రాష్ట్రంలో వరి తర్వాత రెండో పంటగా పండ్ల తోటలు సాగవుతున్నాయి. ఉద్యానవన శాఖ లెక్కల ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలు బత్తాయి, మూడు లక్షల ఎకరాలు నిమ్మ, రెండు లక్షల ఎకరాల్లో మామిడి ,బొప్పాయి ,అరటి, తోటలు సాగవుతున్నాయి. గత పది సంవత్సరాలుగా పకృతి వైపరీత్యాలతో పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోతున్న సంబంధిత అధికారులు పరిహారం అందించడంలో పూర్తిగా విఫలమైనరనే విమర్శలు సర్వత్ర రైతుల నుండి వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా అకాల వర్షాలు, వడగండ్ల వానలు, మంచు ,చలి తీవ్రతకు, ఆలస్యంగా పూత రావడం, కోత సమయంలో పెనుగాలులు సంభవించి పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సంవత్సరం, నాలుగు సార్లు, అకాల వర్షాలు, పెనుగాలులకు మామిడి చెట్లు నేలకొరిగి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న పరిహారం నేటికీ అందని పరిస్థితి కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సబ్స్టేషన్లలో, కాన్పూర్ ఐఐటి విద్యార్థులు తయారుచేసిన వాతావరణం మిషన్లు పనిచేయక రైతులకు పరిహారం అందని పరిస్థితి. తెలంగాణ ప్రభుత్వానికి పండ్ల ఉత్పత్తి ద్వారా లక్షల ఆదాయం వస్తున్నప్పటికీ , పండ్ల తోటల రైతులకు ఇస్తున్న సబ్సిడీలను తగ్గిస్తూ , మార్కెట్ సౌకర్యం కల్పించకుండా, మద్దతు ధర ఇవ్వకుండా, రైతు ప్రభుత్వాలు అని చెప్పుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని రైతులు రైతు సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ప్రభుత్వము మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడంతో సూర్యాపేటలో ఉన్న ఫ్రూట్ మార్కెట్ దళారులకు, అమ్మి,మామిడి రైతులు పైసల కోసం నెలలు తరబడి తిరుగుతున్న వ్యాపారులు ఇవ్వని పరిస్థితి కొనసాగుతుంది. సూర్యాపేటలో ఉన్న ఇద్దరు వ్యాపారులు రత్నవరం రామాపురం గ్రామాల్లో ఉన్న వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి సంవత్సరము పొడవునా, డబ్బులు ఇవ్వకుండా, రైతులను చెప్పులు అరిగేలా తిప్పుకుంటున్నారని పలువురు రైతులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉద్యానవన శాఖలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, సూర్యాపేటలో మామిడి ,నడిగూడెంలో నిమ్మ మార్కెట్ ఏర్పాటు చేయాలని , నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు వాతావరణ ఆధారిత భీమా ను అమలు చేయాలని, నిలిపివేసిన ఫల సాగర్ పథకాన్ని పునరుద్ధరించాలని , పకృతి వైపరీత్యాలతో,నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎకరాకు 50 వేలు పరిహారం ఇవ్వాలని, పండ్ల తోటల రైతులు, పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర నాయకులు వీరాంజనేయులు కోరారు.



# నిఖిల్ భరత్ కాన్వెంట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ వి.బి.మహర్షి సన్మానం

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.జులై 3 : మెటుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోగురువారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్ముల శ్రీనివాసరావు ఇటీవల ఐ టి ఓ ఇండియన్ టాలెంటెడ్ ఒలంపియాడ్ 2024-25 సంవత్సరానికి బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు ముంబాయి వారిచే వి బి మహర్షి స్వీకరించిన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మెటుపల్లి వారు నిఖిల్ భరత్ కాన్వెంట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ వి బి మహర్షి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాసరావు, కార్యదర్శి జైపాల్ రెడ్డి , కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్ జెడ్ సి పోలీస్ శ్రీనివాస్ పోహార్ తుకారాం ఇల్లెందుల శ్రీనివాస్,మర్రి భాస్కర్, ముక్క మృత్యుంజయ వట్టిమల్ల గంగాధర్ జోగ జగదీశ్వర్ స్కూల్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రొజెక్టర్ ద్వారా బూత్ లెవెల్ అధికారులకు - సూపర్వైజర్లకు ట్రైనింగ్

## రానున్న ఎన్నికలలో బిఎల్వోల పాత్ర అత్యంత కీలకం - ట్రైనింగ్ ఇన్చార్జి ఆఫీసర్ - తహశీల్దార్ సునీతా ఎలిజబెత్

ముదిగొండ మండలం జూలై 3 వాయిస్ టుడే : ఎలక్షన్ కమిషన్ తెలంగాణ వారు కండక్ట్ చేసిన ప్రొజెక్టర్ ద్వారా బూత్ లెవెల్ అధికారులకు- సూపర్వైజర్లకు ట్రైనింగ్ లో భాగంగా ట్రైనింగ్ ఇన్చార్జి ఆఫీసర్ మండల తహశీల్దార్ ఆధ్వర్యంలో ముదిగొండ రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముదిగొండ మండల పరిధిలో ఉన్న సహాయ ఓటరు నమోదు అధికారులు, నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లు, బిఎల్ఓ సూపర్వైజర్లు అందరూ గురువారం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ సునీతా ఎలిజబెత్ మాట్లాడుతూ...రానున్న ఎన్నికలలో బిఎల్వోల పాత్ర అత్యంత కీలకమని ప్రతి బిఎల్ఓ తమ విధిని సక్రమంగా నిర్వహించాలని, ఓటర్లకు అవగాన కల్పించాలని వివరించారు. అనంతరం ఎన్నికలకు ముందు రోజు, ఎన్నికలు జరిగే రోజు పని చేసే విధానం, ఈవీఎం , వివి ప్యాట్ నిర్వహణ, ఇతర అంశాలపై శిక్షకులు వీరికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గం లెవెల్ ట్రైనర్,ఏఎల్ఎమ్టీస్, మాస్టర్ ట్రైనీస్ పి.సురేష్, టీ శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వహీదా సుల్తానా,ప్రసన్న కుమార్,బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# జై బాపు ,జై భీమ్ ,జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆత్మీయ సమ్మేళనం ను విజయవంతం చేయండి: దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు

ఇల్లందకుంట జూలై 3 (వాయిస్ టుడే): జూలై 4వ తారీఖున సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్ లోని ఎల్ బి స్ లో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జై బాపు ,జై భీమ్ ,జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆత్మీయ సమ్మేళన సమావేశాను విజయ వంతం చేయాలని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మరియు అన్ని శాఖల మంత్రులు హాజరుకానున్నారు కావున 18 గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు రావాలని పిలుపునిచ్చారు. జై బాపు ,జై భీమ్ ,జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆత్మీయ సమ్మేళనంకు రావాలని కాంగ్రెస్ పార్టీ చరిత్రలో గ్రామ శాఖ అధ్యక్షులు కలవడం సువర్ణ అవకాశం అన్నారు. కేంద్రంలో మరియు మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ఇప్పటినుండే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా వచ్చి కాంగ్రెస్ పార్టీ కోసం అధికారంలోకి తేవడానికి కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు గోడిషాల పరమేష్, చిరంజీవి, గోపాల్ రెడ్డి ,శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటి ఇంటికి మన కౌశిక్ అన్న కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ పట్టణంలో సి ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజురాబాద్ జూలై 3 (వాయిస్ టుడే): గురువారం రోజు హుజురాబాద్ పట్టణంలో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు. మొత్తం లబ్ధిదారులు: 29 మందికి గాను పంపిణీ చేసిన చెక్కుల మొత్తం విలువ: రూ. 8,35,000/-. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు అవసరమైన సమయంలో అండగా ఉండాలన్న బాధ్యతతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తున్నాం. ప్రతి కుటుంబం పట్ల మా వంతు కర్తవ్యం నిర్వర్తించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం అని తెలిపారు. అలాగే హుజురాబాద్ పట్టణంలో ఇటీవల మరణించిన అలాగే అనారోగ్యసమస్యలతో బాధపడుతున్న పలు కుటుంబాలకు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ SC కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గందే శ్రీనివాస్, కౌన్సిలర్లు ముత్యం రాజు, తిరుమల్ రెడ్డి ,యాదగిరి, కుమార్, కొండ్ర నరేష్, అనిల్, పూర్ణచందర్, కుమారస్వామి, తాళ్లపెల్లి శ్రీనివాస్, ఇమ్రాన్, రమా, కిషన్, ప్రతాప్ కృష్ణ మరియు BRS పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వాయిస్ టుడే
జనగళం - మననేత్రం
శుక్రవారం,
జూలై 4, 2025



## పిఎంకె ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ

జమ్మికుంట జూలై 3 (వాయిస్ టుడే): అనాధలకు అభాగ్యులకు పేద పిల్లలకు సేవ చేయాలని సంకల్పంతో పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ సంస్థ ఏర్పాటు చేసి చేయూతను నందిస్తున్నారు. జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ ఆదేశాల మేరకు పిఎంకె ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు. పిఎంకె ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేకమైన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపదలో ఉన్నవారికి అండగా మేమున్నామని అభయహస్తం అందిస్తున్నారు పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకులు. గతంలో పాఠశాలలో ఇదే తరహాలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం జరిగిందని, పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన చిన్నారులకు చేయూతనందిస్తున్న పీఎంకే ఫౌండేషన్ నిర్వాహకులను ప్రధానోపాధ్యాయులు దెబ్బట రవీందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలరాం నాయక్, ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్, రంజిత్ కుమార్ గౌడ్ ,విద్యా కమిటీ చైర్మన్ గుండ్ల రాజు, బండారి శ్రీనివాస్ యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## 18 సం నిండిన నిర్వాసితుల పట్టా ప్యాకేజీ కొరకు దరఖాస్తుల స్వీకరణ

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 3 : రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ఈరోజు 2015 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పట్టా ప్యాకేజీ కోసం దరఖాస్తులను బోయినిపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ నిర్వహించడం జరిగింది దరఖాస్తు సేకరణ లొ బాగంగా ఆయన మాట్లాడుతూ మిడ్ మానేర్ లో చాలామందికి పట్టా ప్యాకేజీ రాలేదు అనే ఉద్దేశంతో ఈ దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుంది. 18 సంవత్స రాలు నిండిన ప్రతి యువతి యువకులకు పట్ట ప్యాకేజీ ఇప్పించలనే ఉద్దేశంతో అలాగే నిర్వాసితుల సమస్యలు తీర్చాలానే ఉద్దేశంతో చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,కలెక్టర్ తో మాట్లాడి,ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.పట్టా వచ్చి ప్యాకేజీ రాకపోయినా ప్యాకేజీ వచ్చి పట్టా రాకపోయినా గెజిట్ లో ఉన్న ప్రతి ఒక్కరికి పట్టా ప్యాకేజీ కోసం.ఈ రోజు కోదురుపాక గ్రామపంచాయతీ లో దరఖాస్తులను స్వీకరించారు.



## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 3 : చొప్పదండి నియోజకవర్గంలోని బో యినిపల్లి మండలం తడగొండ గ్రామంలోని కట్ట మల్లవ్వ కు 36000, మొయినోద్దీన్ 15000 రూపాయల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) నుండి మం జూరైన ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందజేశారు. చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడి పల్లి సత్యం ఆదేశాలతో ఈ చెక్కులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితులకు అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు కొంతమేర ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఈ సహాయాన్ని అందజేస్తున్నామని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అంకితంగా పనిచేస్తుంది అని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న బాధితులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరియు కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపిటిసి ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 3 : గురువారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా గురువారం ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్ ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ , పాల్గొన్నారు.

# ఉద్యమకారుడు దరువు అంజన్నకు ప్రభుత్వ గుర్తింపు పట్ల సత్కారం

### సన్మానించిన ప్రజా, జర్నలిస్టు,విశ్వకర్మ సంఘాలు

### ప్రభుత్వానికి నిబద్ధుడనై పనిచేస్తా - దరువు అంజన్న



ఎల్బీనగర్ జులై 3 (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారుడు, ప్రజా సేవకుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దరువు అంజన్న ను సాంస్కృతిక శాఖ సలహాదారునిగా నియమించడం పట్ల పలు ప్రజాసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా దరువు అంజన్నను శాలువాతో సత్కరించి ఆయన చేసిన సేవలను మునుముందు చేయబోయే సేవలను గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఉద్యమకారులను ప్రజా కళాకారులను గుర్తించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. జగద్గిరిగుట్టలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో, జగద్గిరిగుట్ట బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో జర్నలిస్ట్ ఎమ్మార్పీఎస్ సిపిఐ సంఘాల నాయకులు, గాజులరామారంలో విశ్వకర్మ విజ్ఞాన సమితి నాయకులు అంజన్నను సత్కరించారు. వైద్యరత్న సత్యనారాయణ, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపకులు విజయ్, సాజిద్ ఎన్ ఎస్ యూ ఐ నాయకులు సాయి పంతులు, నవీనాచార్యులు, శివాజీ, సెల్వరాజ్ శ్యామ్, జర్నలిస్ట్ నాయకులు డప్పు రామస్వామి, తొండ వెంకట్ బాలరాజు సాయిరాజ్ మల్లేష్ రమేష్ ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గన్న, విశ్వకర్మ సేవా సంఘం నాయకులు బ్రహ్మానంద చారి,కృష్ణ చారి, కళాకారుడు తాండూర్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్ష సమావేశం

### ఆసుపత్రులు సూపరింటెండెంట్లు, నర్సింగ్ సూపర్డెంట్లు, ఫార్మాసిస్టులతో ప్రత్యేక సమావేశం

### విష జ్వరాల నేపథ్యంలో వైద్య సిబ్బందికి పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 3 : జిల్లాలో భారీ వర్షాలు నేపథ్యంలో రాబోయే రోజుల్లో విష జ్వరాలు ప్రభలే అవకాశం ఉన్నందున ఆసుపత్రి సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని గురువారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్ లకు ఆదేశాలు ఇచ్చారు. అన్ని రకాల మందులు, రీఏజెంట్లు, టెస్టింగ్ కిట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు.వివిధ హోదాల్లో ఉన్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించి 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు .ఇప్పటికే అన్ని ఆసుపత్రులలో కావాల్సిన మందులు రీఏజెంట్లు ,మౌలిక వసతులు ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేసిన క్రమంలో రాబోయే రోజుల్లో రోగు లను ఎటు వంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. అదేవిధంగా ఆసుప త్రులలో ఎటువంటి చిన్న చిన్న సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి తగిన పరిష్కార ఏర్పాట్లు తాను చేస్తానని , అవసరమైన నిధులు మంజూరు కి ఏర్పాట్లు చేస్తా నని తెలిపారు. ఆసుపత్రిలో ఇన్సులిన్, మలేరియా మందులు అందుబాటులో లేవని వాటి గు రించి వైద్య సిబ్బంది జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రాష్ట్ర అధికారులతో మాట్లాడి వాటిని అందుబాటులోకి తీసుకొనిరాడానికి ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులు ,నర్సింగ్ సూపరింటెండెంట్ లు శానిటేషన్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# రుణ వేధింపులతో, "బాధితుల" బ్రతుకు చిద్రం

### అధిక వడ్డీ, చెక్ బౌన్స్ పి వసూలు




రాయికల్( వాయిస్ టుడే) : రుణాలు ఇస్తాం తీసుకోండి అంటూ వెంటపడుతున్న కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా ఇష్ట రాజ్యాంగ రుణాలు ఇస్తున్నారు లోన్ ల కంపెనీలు , పుట్ట గొడుగుల్లాగా పుట్టుకొస్తున్న ప్రైవేటు ఆన్ లోన్ బ్యాంకెజి లు లక్షల కోట్ల రూపాయల స్థానిక గ్రామాలల్లో ఉండే వడ్డీ వ్యాపారాన్ని హస్తగతం చేసుకున్నారు ,తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు ఇస్తామంటూ అర్జీదారు లను మచ్చిక చేసుకుని క్రెడిట్ కార్డు తీసుకోండి, ఈ ఇ ఎం ఐ కార్డు లు తీసుకోండి, మా ఆప్ లో లోన్ తీసుకోండి అంటూ అనేక రకాల విజ్ఞప్తులు చేస్తూ వెంటపడుతున్న రుణాల సేల్స్ ప్రమో టర్స్ వలన రుణాలు తీసుకుంటే క్రెడిట్ కార్డులు ఇ ఎం ఐ కార్డులు తీసుకుంటే సెల్స్ మెన్ టార్గెట్ నిండుతుంది కానీ రుణ గ్రహీతలకు మాత్రం చుక్కలు చూపిస్తున్నారు

#### వేధింపులు ఘోరం

రుణ గ్రహితలు రుణం చెల్లించ లేని పక్షంలో గడువు ఇవ్వచ్చు, నిబంధనల ప్రకారం నోటీసులు పంపవచ్చు కానీ రుణ గ్రహీతల ఫోన్ లు హ్యాక్ చేసి దాంట్లో ఉన్న సున్నితమైన కాంట్రాక్టు సమాచారాన్ని తీసుకొని అందులో ఉన్న వారి రిలేటివ్స్ కు మిత్రులకు ఫోన్ చేసి పాలన వ్యక్తి లోన్ తీసుకొని కట్టడం లేదు మీ పేరు చెప్తున్నారు మీరు కట్టండి లేదా కట్టించండి అంటూ హుకుం జారీ చేస్తూ విపరీతమైన బూతులు తిడుతున్నారు సంబంధంలేని వ్యక్తులకు ఫోన్ చేస్తూ రుణ గ్రహీతల పరువును బజారుకు ఇడిస్తున్నారు వాస్తవంగా రుణాలు పరువు కాపాడుకోవడానికి తీసుకోవడం జరుగుతుంది కానీ ఈ ఆన్ లైన్ లోన్ విధానాల ద్వార రుణ గ్రహీతల పరువు బజారు పాలై అనేకమంది బాధితులు తనువు చాలించిన సందర్భాలు కూడ గతంలో అనేకం జరిగినాయి దీని నిర్మూలనకు ప్రభుత్వం అనేక పాలసీ లు, తీసుకవచ్చిన అయినా అట్టి నిబంధనలను గాలి వదిలేసి రుణ గ్రహీతల ఇండ్ల మీదికి వెళ్లి బెదిరింపులకు దిగుతున్నారు లోన్ కడతారా లేదంటే మీ సంగతి చూస్తా అంటూ బుతుల మాటలతో దుర్భషలాడుతూ స్త్రీల మనోభావాలను కూడ దెబ్బతిస్తున్నారు అని గతంలో అనేక సందర్భాలు బహిర్గత మైనయి అయినా వీరి విధానాలు మారడం లేదు వీరు మరింత మితిమీరి వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే తీరు మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తుంది స్థితి కనిపిస్తుంది

#### రుణం కట్టకుంటే ఏం చేయాలి

రుణ గ్రహీతలు రుణం చెల్లించలేని సందర్భంలో వారికి మూడు నెలల నుంచి ఆరు నెలల వరకు సమయం వరకు గడువు ఇచ్చి ఈ యొక్క గ్యాప్ లో ఇఎం ఐ లు చేర్చి తదుపరి చెల్లించే అవకాశాన్ని కల్పించవచ్చు మరియు రుణం చెల్లించుట లో మరింత జాప్యం జరిగితే రుణ గ్రహీత పరిస్థితి బాగా లేకపోతే సెటిల్మెంట్ సిస్టం ద్వారా లోన్ సెటిల్మెంట్ చేసుకొని ఇరు పార్టీలకు ఆమోదయోగ్యమైన రుణాన్ని చెల్లించవచ్చు దాంతో పాటు రుణం చెల్లించని స్థితిలో లేని గ్రహిత కు మూడుసార్లు నోటీసులు పంపిన అనంతరం కోర్టుకు వెళ్లే అవకాశం కూడ ఉంటుంది అంతేకానీ వారి ఇండ్ల మీదికి వెళ్లి , బెదిరింపులకు దిగి మానసికంగా వేధించే అధికారం లేదని ఈ ఫైనాన్స్ సంస్థల ఏజెంట్లు ఇలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని న్యాయ నిపుణుల పేర్కొన్నారు

# గిరిజన ప్రాంతాల్లో ఔషధ గుణాలు గల మేకపాల ఉత్పత్తి, విక్రయ కేంద్రాల ఏర్పాటు అవసరం

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 3 : భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈరోజు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖాధికారి, మండల స్థాయి పశువైద్యాధికారులు, జిల్లా వెటర్నరీ వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గిరిజన గ్రామాలలో గిరిజనులు మహిళల వద్ద ఉన్న మేకల సంతతిని అభివృద్ధి చేసి అధిక పాల దిగుబడి సాధించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మేకపాల విశిష్టతను ప్రజలకు తెలియజేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మేకపాల నుండి పెరుగు, మజ్జిగ, జున్ను, పన్నీరు, చీజ్ వంటి ఉత్పత్తులను తయారు చేసి వినియోగించే పద్ధతులపై గిరిజనులు మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా, మేకపాలను ప్రోత్సహించడం ద్వారా మేకలు అడవుల్లో లభించే ఆకులు, చెట్లు మేతగా తీసుకోవడం వలన అడవులను రక్షించవచ్చని, అడవులు మనలను రక్షిస్తాయని కలెక్టర్ తెలిపారు. మేకల మేత కోసం అవసరమైన మొక్కలను నాటడం ద్వారా అడవుల అభివృద్ధి జరగగలదని, దీని వల్ల గిరిజనులు, మహిళలు, సమాజం మొత్తానికి లాభం చేకూరుతుందని వివరించారు. జిల్లా ప్రజలకు ఆరోగ్యకరమైన మేకపాలను అందించడానికి ప్రత్యేకంగా మేకపాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వీటి మార్కెటింగ్ ద్వారా గిరిజనులు మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఇకపై గిరిజనులు మహిళలను బాతులు, కౌజు పిట్టల పెంపకంపై కూడా ప్రోత్సహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని, ఈ చర్యల ద్వారా ఆదివాసీ కుటుంబాలు మహిళలు ఆర్థికంగా లాభపడడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం పొందగలరని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.


# సామాన్య కార్యకర్తకు పట్టం కట్టిన భారతీయ జనతా పార్టీ

హుజూర్ నగర్ జులై 03( వాయిస్ టుడే ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా సీనియర్ నాయకులు అయినటువంటి నారపరాజు రామచందర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకునందున హర్షం వ్యక్తం చేసి, వారికి శుభాభినందనలు తెలిపిన హుజూర్ నగర్ పట్టణ శాఖ. ఈ సందర్భంగా పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ మన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందినటువంటి సామాన్య కార్యకర్తను రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినందుకు జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భారతీయ జనతా పార్టీ అంటే కార్యకర్తల పార్టీ అని, ఈ పార్టీలో పని చేసినటువంటి ప్రతి ఒక్క కార్యకర్తకు అవకాశం కల్పించేటువంటి పార్టీ అని, ఇది ప్రజల పార్టీ అని మరొక్కసారి రుజువయిందని తెలిపారు. ఈ పార్టీలో సుమారుగా 45 సంవత్సరాలుగా సామాన్య కార్యకర్తగా పని చేసుకుంటూ వస్తూ పార్టీ కోసం ఎంతో కష్టపడి, మావోయిస్టులకు వ్యతిరేకంగా పోరాడి, ఎన్నోసార్లు అరెస్టయి, లాఠీ దెబ్బలు తిన్నటువంటి కార్యకర్తకు ఈరోజు రాష్ట్ర అధ్యక్షులుగా అవకాశం కల్పించడం ఒక శుభ పరిణామం అని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ నారపరాజ రామచంద్ర రావ ఆధ్వర్యంలో రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ప్రజా సమస్యలపై పోరాడి వారి నాయకత్వంలో రాబోయే రోజులలో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతలపూడి ఉమామహేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, పట్టణ



ఉపాధ్యక్షులు కొల్లోజు నాగేంద్ర చారి, పట్టణ కార్యదర్శి చుక్క హరీష్ మండల నాయకులు బలవంత్ సింగ్, బైరు సతీష్ మరియు పోలింగ్ బూత్ అధ్యక్షులతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల తర్వాత న్యాయ విజయంతో కిషోర్ వెలమకన్నికి న్యాయం



సూర్యాపేట, జూలై 3(వాయిస్ టుడే ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా చింతపాలెం మండలం శోభనాద్రి గూడేనికి చెందిన కిషోర్ వెలమకన్ని, కి 15 ఏళ్ల తర్వాత అమెరికా కోర్టులో న్యాయం లభించింది. 2010లో ఒక వ్యక్తి ఇంట్లో జరిగిన కుక్క కాటు ఘటనపై ఆయన కోర్టులో కేసు వేశారు. 2010 ఏప్రిల్ 22న కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చి డ్యామేజెస్, వడ్డీ, న్యాయ ఖర్చులు కలిపి $10,359.90 మంజూరు చేసింది. అయితే, కేసులో ప్రత్యర్థి ఆస్తి మీద అప్పులు ఉండటంతో వెంటనే రకంగా డబ్బు రాలేదు. ఇప్పుడు, ఆమె ఆ ఆస్తిని అమ్మే సమయంలో, కిషోర్ గారి తీర్పు అమలు చేయాల్సి వచ్చిందని న్యాయవాదులు తెలియజేశారు. దీంతో మొత్తం $29,092.91 వసూలయ్యింది. లాయర్ ఫీజులు, ఇతర ఖర్చులు మినహాయించి చివరకు $18,429.83 (Rs.24.27 లక్షలు) కిషోర్ అందనుంది. ఈ కేసు ద్వారా ఎంతకాలం అయినా, న్యాయం తప్పకుండా జరుగుతుంది అనే విషయాన్ని మరోసారి చాటిచెప్పింది. అన్యాయం ఎదురైన ప్రతీ వ్యక్తికి ఇది ఒక మోటివేషన్ కావచ్చు.



## ముజావారు షేక్ సైదా ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన పీర్ల ఊరేగింపు

హుజూర్ నగర్ జులై 03 (వాయిస్ టుడే ప్రతినిధి) : గురువారం హుజూర్ నగర్ పట్టణం లోని ముజావారు షేక్ సైదా ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్ మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్టణ అధ్యక్షులు మల్లికార్జున్ రావు మాట్లాడుతూ అనాదికాలంగా హిందూ ముస్లిం ఐక్యతగా జరుపుకునే పీర్ల పండుగను హుజూర్ నగర్ పట్టణంలో ప్రతి సంవత్సరం ఇంత ఘనంగా నిర్వహిస్తున్నటువంటి ముజావర్లను అభినందిస్తూ ఆరో తారీకు జరగబోయే మొహరం పండుగను ప్రజలందరూ పాల్గొనాలని పాడిపంటలు మంచిగా పండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని అనాది కాలంగా వస్తున్న ఇటువంటి పండుగలను ఘనంగా జరుపుకోవాలని అన్నారు పట్టణ వైస్ ప్రెసిడెంట్ కోలపూడి యోహాన్. పట్టణ కార్యదర్శి ఎడవెల్లి వీరబాబు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెల్దండ వీరారెడ్డి. సోషల్ మీడియా అనీఫ్. యువ నాయకులు చలిగంటి గణేష్. ముజావర్లు మోహిన్, నాగుల్ మీరా, మేరా భాష, చాంద్ పాషా పాల్గొన్నారు




## వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ముందు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.జూలై 3 : జగిత్యాల్ జిల్లా మెటుపల్లి పట్టణం లోనీ గురువారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద భోజన సమయంలో మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మహబూబ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ పై ఆ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాడి చేసిన విషయాన్ని ముక్త కంఠంతో ఖండిస్తూ రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్ నరసింహరెడ్డి, కార్యదర్శి ముకరం గారి ఆదేశాల మేరకు ఈ రోజు మెట్టుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణ నందు ఉద్యోగులు అందరు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయుట జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి సూపర్వైజర్ వేముల హరికృష్ణ సూపర్వైజర్ సురేందర్ కంప్యూటర్ ఆపరేటర్ బి సతీష్ ఎలిగేటి శ్రీనివాస్ నవీన్, విక్రమ్ వెంకట సాయి శ్రీకాంత్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఐద్వా ఆధ్వర్యంలో హాస్పటల్ సర్వే

సూర్యాపేట, జూలై 3(వాయిస్ టుడే ప్రతినిధి). సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో ఏరియా హాస్పిటల్ ను ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మరియు జిల్లా ఐద్వా బృందం సర్వే చేయడం జరిగింది. ఈ సర్వేలో శానిటేషన్ సరిగా చేయడం లేదు పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది బాత్రూమ్స్ నీటుగా లేవు వైరల్ ఫీవర్ వస్తున్నాయి సీజనల్ వ్యాధుల వలన ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు రక్త పరీక్షలకు సంబంధించి అన్ని రకాల టెస్టులు అందుబాటులో లేవు డెలివరీ కి వచ్చిన వారికి చాలామందికి నార్మల్ డెలివరీ కావడం లేదు అందరికీ ఆపరేషన్ అవుతా ఉన్నాయి అన్ని రకాల మెడిసిన్స్ కూడా అందుబాటులో లేవు ఖాళీ గా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని,మెడికల్ సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలి. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు మేఘన బోయిన సైదమ్మ, జూలకంటి విజయలక్ష్మి, ఆఫీస్ బేరర్స్ కాజా బి జిల్లా కమిటీ సభ్యులు మంగమ్మ, రమాదేవి, సుశీల, విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్



హుజూర్ నగర్ జూలై03 (వాయిస్ టుడే ప్రతినిధి) : సామాన్యులు కట్టే పనులతో నడిచే ప్రభుత్వం జాతీయ సంపదను కార్పొరేట్ సంస్థలకు, వ్యక్తులకు కట్టబెట్టడం, దూచిపెట్టడం ఎంతవరకు న్యాయం, సబబు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ ప్రభుత్వాలను ప్రశ్నించారు. గురువారం హుజూర్ నగర్ లో ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి అధిక పనులు చెల్లించే 72% సామాన్యులలో కార్మికుల అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. అటువంటి కార్మికులకు హక్కులను లేకుండా చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కార్మికులందరూ పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమీకరణ, ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించబడతాయని, సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్మికులకు ఏమి కావాలో కార్మిక వర్గాలకే తెలుస్తుందని, కార్పొరేట్ సంస్థలకు వాళ్లకు మద్దతిచ్చే ప్రభుత్వ అధినేతలకు తెలియదని ఎద్దేవా చేశారు. కుల మత అబద్దాలతో పాలకులు ఎక్కువ కాలం అధికారంలో ఉండలేరన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్,యల్లావుల రమేష్, జెట్టి ప్రసాద్, మారుడి శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, ఎస్.కె హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## నర్సరీని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూలై-3 వాయిస్ టుడే: స్థానిక మున్సిపల్ పరిధిలో మార్కండేయ కాలనీలో గల నర్సరీని మున్సిపల్ కమిషనర్ రమేష్ పరిశీలించి వార్డులలో మెయిన్ రోడ్ ల వెంట చెట్లు నాటుటకు అనువైన ప్రదేశాలను గుర్తించి చెట్ల సంరక్షణకు కావలసిన తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు ఎ ఈ రాజ్ కుమార్, సెక్షన్ ఇంచార్జి రాజు,వార్డు ఆఫీసర్ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..




# ప్లాస్టిక్ కవర్లు వద్దు గుడ్డ సంచులే ముద్దు

## ::: ఏ వి వి ప్రిన్సిపాల్ డాక్టర్ భుజంగరెడ్డి

వరంగల్ ( వాయిస్ టుడే ) జూలై 03 : అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఏవివి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో "ప్లాస్టిక్ బ్యాగులు వద్దు గుడ్డ సంచులు మరియు టిఫిన్ బాక్స్ లే ముద్దు" అంశంపై ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భుజేందర్ రెడ్డి అలాగే ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం 90 మైక్రాల కన్నా తక్కువగా మందం గల సింగల్ యూస్ ప్లాస్టిక్ బ్యాగ్స్ ను ఎప్పుడో బ్యాన్ చేసిందని కానీ ఇప్పటికీ అవి మార్కెట్ లో చలామణిలో ఉన్నాయని సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వల్ల పర్యావరణం ముఖ్యంగా కాలువలు, చెరువులు, నదులు కలుషితమవుతున్నాయని అలాగే భూమి ఇతర జంతువులకు కూడా నష్టం వాటిల్లుతుందని దీనికోసం ప్రతి ఒక్కరూ విధిగా బట్ట సంచులు మరియు ఇతర సామాగ్రి తీసుకెళ్లి ప్లాస్టిక్ బ్యాగులను వాడటం మానేయాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు మేలు చేసిన వారు అవుతారని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం నడుము బిగించాలని ముఖ్యంగా వాలంటీర్లను చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుజేందర్ రెడ్డి, కోడిమాల శ్రీనివాసరావు ప్రోగ్రామ్ అధికారి విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్ అనిత ,సంజీవ ,నవీన్, సంధ్య రాణి ,రమాదేవి, శ్రీకాంత్, సీనియర్ వాలంటీర్లు దేవిశ్రీప్రసాద్, సాకేత్, క్రాంతి ,సాత్విక్, చిరంజీవి మరియు ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు భారతీయ క్రైస్తవ దినోత్సవం: రెవ. ఉటుకూరి రాజు



హుజూర్ నగర్ జులై 03( వాయిస్ టుడే ప్రతినిధి) : హుజూర్ నగర్ పట్టణ కేంద్రం లో స్థానిక 24వ వార్డు, గుడ్ న్యూస్ చర్చ్ నందు రెవ. ఉటుకూరి రాజు తన నివాసంలో ఘనంగా జూలై 3న " సేయింట్ థామస్ హతసాక్షి దినోత్సవం" సందర్భంగా దేశ ప్రజలకు భారతీయ క్రైస్తవ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీ. శ. యేసు క్రీస్తు శిష్యులు అయినా 12 మంది లో ఒకరైన అపో. సేయింట్ థామస్ యేసు క్రీస్తూ డొక్కలో మరియు తన చేతి గాయములలో వ్రేలు పెట్టి చూసి నమ్మిన వాడు, క్రీ.శ 52లో భారత దేశంలోని కేరళ రాష్టంలోకి సువార్త నిమిత్తం వచ్చి అక్కడ నుండి తమిళనాడు కు సువార్త ను ప్రకటించి అనేకులను క్రీస్తూ లోని నడిపించారు, పరంగిమలై భారతదేశంలోని తమిళనాడులోని చెన్నైలోని ఒక చిన్న కొండ, గిండికి సమీపంలో మరియు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చాలా సమీపంలో ఉందనీ. భారతదేశంలోని పురాతన సిరియన్ క్రిస్టియన్ కమ్యూనిటీ వారి చర్చి యొక్క మూలాన్ని సెయింట్ థామస్ ది అపోస్టల్ గా గుర్తించారనీ.సేయింట్ థామస్ 20 సంవత్సరాలు సువార్త ను ప్రకటించి క్రీ.శ 72లో మైలాపూర్ లో హతసాక్షిగా హత్యకు గురయ్యారని ఆయన మరణించిన దినం ప్రతి యేటా జూలై 3న పండుగగా జరపుకుంటరని అన్నారు.భారత దేశానికి సువార్త ఇంగ్లీష్ వారి ద్వారా రాలేదని, ఇజ్రాయెల్ నుండి వచ్చిందని గుర్తు చేస్తూ అది మాత్రమే కాకా వస్కోడీ గామా అమెరికా నుండి సముద్ర మార్గాన్ని మన దేశానికి కనిపెట్టకముందే భారతదేశం లో క్రైస్తవులు వున్నారని, ఇంకా బైబిల్ లోని పాత నిబంధనలోని పరో కాలం నానీ సమాజ మందిరం "చిన గోగు " కేరళ లోని కొచ్చి లో ఉందని అన్నారు.



## నూతన కమిషనర్‌ను సన్మానించిన బిజెపి నాయకులు

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూలై-03 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన తిప్పరాజు రమేష్ ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి నాయకులు. ఈ ఈ సందర్భంగా నూతన కమీషనర్ కు సుల్తానాబాద్ మున్సిపాలిటీలో పలువార్డ్ లలోని సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ప్రస్తుత వానకాలం సీజన్ కావడం వలన ప్రజలకు కలిగే సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని ప్రజలందరికీ ప్రతిరోజు అందుబాటులో ఉండి మున్సిపాలిటీలోని అన్ని వార్డ్ లను పరిశుభ్రంగా ఉంచాలని కమీషనర్ ను కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు, ఓబిసి జిల్లా కార్యదర్శి చిట్టవేని సదయ్య, ఉపాధ్యక్షులు ఎనగందుల సతీష్, గజభింకర్ పవన్, ప్రధాన కార్యదర్శి కందునూరి కుమార్, కార్యదర్శి వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..



## కాంగ్రెస్ పార్టీ బహిరంగసభను జయప్రదం చేయండి

### గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి పిలుపు

వరంగల్ (వాయిస్టుడే) జూలై 03 : గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజనాల శ్రీహరి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు గురువారం ప్రెస్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా అయినమాట్లాడుతూ శుక్రవారం నాడు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ లో పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే పాల్గొంటారని, ఈ బహిరంగ సభ ను విజయవంతం చేయాలని, ఈ సభ కు పెద్ద సంఖ్యలో యూత్ కాంగ్రెస్, బీసీ సెల్ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, మైనార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సేవాదళ్ నాయకులు, అందరు పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని రాజనాల శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్, లోక వినోద్ నాయక్,బానోత్ వెంకన్న నాయక్, శేఖర్, రాంచందర్ పాల్గొన్నారు..






## ప్రజా సమస్యల పరిష్కారామే లక్ష్యం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ జులై 3( వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, వివిధ కాలనీల సభ్యులు, సంఘ సభ్యులు మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళు_న్నామని తెలిపారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో జరగబోయే శుభ కార్యక్రమాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు... ఈరోజు 132 డివిజన్ జీడిమెట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కుంటా సిద్దిరాములు పుట్టిన రోజు సందర్భంగా ఎమెల్సీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.




## ప్లాస్టిక్ నిషేధిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం

### మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్ పి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ శ్రీ సొంటిరెడ్డి పున్నారెడ్డి

కుత్బుల్లాపూర్ జులై3(వాయిస్ టుడే) : జులై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని "అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే" అని కూడా అంటారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి ప్లాస్టిక్ ర రహిత సమాజం కొరకు జ్యూట్ బ్యాగులను డిస్ట్రిబ్యూట్ చేయడం జరిగినది ప్రతి ఒక్కళ్ళు కూడా మార్కెట్ కి వెళ్లేటప్పుడు జ్యూట్ బ్యాగులు తీసుకొని వెళ్ళాలని కోరుకోవడం జరిగింది . ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణానికి కలిగే హాని గురించి అవగాహన కల్పించడానికి, ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించాలని తెలియజేయడమైనది



## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కలిసిన నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

కుత్బుల్లాపూర్ జులై 3(వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా శాలివాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు..

# రేషన్‌కార్డ్‌ల వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించండి

### మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

### రేషన్ కార్డు వెరిఫికేషన్ అధికారులతో సమావేశం



వరంగల్ (వాయిస్టుడే), జూలై 03 : రేషన్ కార్డ్ ల వెరిఫికేషన్ ప్రక్రియ ను పకడ్బందీగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్లో రేషన్ కార్డ్ వెరిఫికేషన్ అధికారులు, ఆర్ ఐ లు, ఆర్ ఓ లతో రేషన్ కార్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పురోగతిని కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బల్దియా పరిధి లో వరంగల్ జిల్లా కు సంబంధించి కొత్త రేషన్ కార్డుల కోసం 12,200 దరఖాస్తులు, హనుమకొండ జిల్లా కు సంబంధించి 16,700 కొత్త రేషన్ కార్డు ల కోసం దరఖాస్తులు రావడం జరిగిందని, వరంగల్ జిల్లా పరిధిలో ఇప్పటికే 50% వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయిందని, మిగతా దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 10 లోగా పూర్తి చేయాలని, ఇందుకోసం వెరిఫికేషన్ అధికారులు ఉదయం నుండి క్షేత్రస్థాయిలో పని చేయాలని వీటితో సమాంతరంగా ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ఇవ్వడం తో పాటు రెగ్యులర్ విధులను కూడా నిర్వహించాలని అన్నారు. ఆర్ ఓ లు ఆర్ ఐ లు నిరంతరం ఇట్టి ప్రక్రియను పర్యవేక్షించాలని ఏవైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే డి ఎస్ డి ఓ సాంకేతిక సిబ్బంది సహకారంతో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, డిప్యూటీ కమిషనర్లు రవీందర్ ప్రసన్న రాణి ఆర్ ఓ లు యూసుఫొద్దిన్ షహజాది బేగం టి ఎం సి రమేష్ కమ్యూనిటీ ఆర్గనైజర్ లు తదితరులు పాల్గొన్నారు

# మున్నూరు కాపుల అభివృద్ధికి సహకరిస్తా డాక్టర్ వినయ్ కుమార్

## స్వర్గీయ శివ శంకర్ దంపతులకు మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తం రావు ఘన నివాళి



శంషాబాద్, జులై 3 : మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ శివశంకర్ మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం అధ్యక్షులు నేతృత్వంలో సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్ మరియు కార్యవర్గం మామిడిపల్లి లోని శివశంకర్ స్మారక చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇటీవల నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ లో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా భారీ మెజార్టీతో గెలుపొందిన సర్దార్ పుటం పురుషోత్తమరావు పటేల్, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుక్క వేణుగోపాల్ పటేల్, మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మ పటేల్ తదితర కార్యవర్గ సభ్యులు మామిడిపల్లిలో కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ బాచో ప్రోగ్రాం కమీటీ ఛైర్మెన్ డాక్టర్ పుంజాల వినయ్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దివంగత కేంద్ర మంత్రి, ప్రముఖ న్యాయ కోవిదులు, పుంజాల శివశంకర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వినయ్ కుమార్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా కార్యవర్గానికి పలు సూచనలు చేశారు. పార్టీలకతీతంగా మున్నూరు కాపు సంఘ కార్యవర్గం వ్యవహరించాలని, పారదర్శకంగా ఉండాలని, ఇప్పటివరకు లెక్క ఇప్పటినుంచో లేక అన్నట్లుగా గతంలో పనిచేసిన కార్యవర్గం లాగా కాకుండా మున్నూరు కాపుల సంక్షేమం కోసం పాటుపడాలని డాక్టర్ వినయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. సంఘానికి శాశ్వతం ప్రాతిపదికన ఒక కార్యాలయం ఉండాలని కార్యక్రమాలు జరగడానికి ఒక వేదికను రూపొందించుకోవాలని, నిధులను సమీకరించుకోవాలని ఆయన సూచించారు. మున్నూరు కాపులకు జనాభా ప్రాతిపదికన చట్ట సభలలో ప్రాతినిధ్యం పెరిగేలా సంఘం బాధ్యతలు తీసుకోవాలని, ప్రభుత్వం తరఫున ఎలాంటి సహకారం కావాలన్నా తాను ముందుంటానని డాక్టర్ వినయ్ కుమార్ హామీ ఇచ్చారు. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రావు మాట్లాడుతూ మున్నూరు కాపుల ఉనికిని చాటి చెప్పిన స్వర్గీయ పుంజాల శివశంకర్ చూపిన దారిలో సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని, గతంలో మాదిరిగానే ఒకే కులం ఒకే సంఘం నినాదంతో తెలంగాణ రాష్ట్రం లో విస్తృతంగా పర్యటించి మున్నూరు కాపులను ఏకతాటిపైకి తీసుకొచ్చి సత్తా తెలియజేస్తామని అన్నారు. డాక్టర్ వినయ్ కుమార్ ఇచ్చిన సలహాలు, సూచనలను తప్పకుండా పాటిస్తామని సర్దార్ పురుషోత్తమరావు మరియు కార్యవర్గం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి, అంబర్పేట్ నియోజకవర్గం కోఆర్డినేటర్ ఉప్పు సత్యనారాయణ, దిల్సుఖ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు అనంతుల నవీన్ పటేల్, విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనికేత్ కోశిగ, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ 15 వ మర్పల్లి వార్డు నాయకులు పాశం కరుణాకర్, పాశం జైహింద్, పాశం యాదగిరి, పాశం కరన్ తదితరులు పాల్గొన్నారు.





## హరిహర వీరమల్లు ట్రైలర్ రిలీజ్ వేడుకలు

### :::పాల్గొన్న జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్ పల్లి: జులై 3(వాయిస్ టుడే) : కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని విమల్ థియేటర్ లో ప్రదర్శించిన హరిహర వీరమల్లు ట్రైలర్ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ తో కలసి జన జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్లఐలయ్య

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని వేకువ జామున దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి శ్రీ ఎస్. వెంకట్రావ్ ఐఏఎస్ వారి ఆధ్వర్యంలో దర్శన ఏర్పాట్లు గావింపబడినవి ఆలయ సంప్రదాయ స్వాగతం పలికిన ఆలయ అర్చకులు ..వేదాశీర్వచనం చేసిన వేద పండితులు.శ్రీ స్వామి వారి చిత్ర పటం,లడ్డు ప్రసాదం అందజేసిన కార్యనిర్వాహణాధికారి

# ప్రతి విషయం మల్టీ డిక్షనరీ కోణంలోనే, క్షుణ్ణంగా తెలుసుకుంటేనే ఉన్నత జీవితానికి మార్గాలు

### తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ. బాల కిష్టారెడ్డి




సికింద్రాబాద్, జులై 03 (వాయిస్ టుడే ప్రతినిధి) : సమాజంలోని ప్రతి విషయం మల్టీ డిక్షనరీ కోణంలోనే ఉంటాయని, వాటిని క్షుణ్ణంగా తెలుసుకున్నప్పుడే ఉన్నత జీవితానికి మార్గాలు వేసుకోగలమని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. బాల కిష్టారెడ్డి వ్యాఖ్యానించారు. ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగిన మల్టీ డిసిప్లినరీ డైలాగ్ అండ్ డిస్కోర్స్ ఇన్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ అనే రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా జాతీయ విద్యా విధానం రూపొందించారని, అందులో మల్టీ డిసిప్లినరీ కోణం కూడా దాగి ఉందని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు చాలా విస్తారంగా అభివృద్ధి అవుతున్నాయని, వీటి నేపథ్యంలో కొత్త పాఠ్యాంశాల రూపకల్పన చేయాలని సూచించారు. తాను ఒక అధ్యాపకుడిగా ఇలాంటి ఎన్నో ప్రయోగాలను చేశానని, అవి విజయవంతంగా నేడు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. డైరెక్టర్ ప్రొ. బి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మల్టీ డిసిప్లినరీ సెమినార్లు విద్యార్థుల అవగాహన స్థాయిని, పరిశోధనల ప్రామాణికతను పెంచుతాయని అన్నారు. ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ పరిశోధనలను ప్రోత్సహించడానికి నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. తమ సంస్థ పరిశోధనలకు సహాయ సహకారాలు అందిస్తుందని, అందరూ మైనర్, మేజర్ ప్రాజెక్టుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ డీన్ ప్రొ. సయద్ తలాత్ సుల్తానా మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, ఈ విధమైన కాన్ఫరెన్స్ లు భవిష్యత్తులో కూడా మరెన్నో జరగాలని ఆకాంక్షించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సి. కాశీం మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాల చరిత్రలో మొట్టమొదటిసారిగా మల్టీ డిసిప్లినరీ కోణంలో ఈ కాన్ఫరెన్స్ రూపొందించామని అన్నారు. దేశవ్యాప్తంగా 20 మంది నిపుణులను ఆహ్వానించి తమ పరిశోధన పత్రాలను సమర్పించాలని కోరగా, 19 మంది హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. వీటి ఆధారంగా ఈ మహాసభ విజయవంతమైందని భావిస్తున్నామని అన్నారు. అలాగే ఆర్ట్స్ కాలేజీ లోని ప్రతి విద్యార్థి తన సబ్జెక్టుతో పాటు ఇతర సబ్జెక్టులోని అనేక కోణాలను ఈ కాన్ఫరెన్స్ ద్వారా నేర్చుకున్నారని అన్నారు. కాన్ఫరెన్స్ ప్రారంభం నుండి ముగింపు వరకు చాలా ఉత్సాహబరితంగా, విద్యాత్మకంగా సాగిందని ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆరు వందలకు పైగా ప్రతినిధులు పాల్గొన్న ఈ సభలో ప్రొ. సుశాంత్ కుమార్ మిశ్ర, ప్రొ. అడపా సత్యనారాయణ, ప్రొ. జి. శ్రీనివాస్ రెడ్డి, ప్రొ. రమేష, ప్రొ. శైలేంద్ర, డా. సంగీత భమిడిపాటి, డా. గ్రేస్ సునీత, ప్రొ. గంపా వెంకట్రామయ్య, డా. సయీద్ జహంగీర్, ధర్మ దాస్, డా. సుదర్శన్ పసుపులేటి వంటి వక్తలు వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూజీసీ డీన్ ప్రొ. లావణ్య సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. సి. అరుణ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్స్ డా. కొండా నాగేశ్వరరావు, డా. బాలు నాయక్, డా. పి. స్వాతి, డా. సి. ఎస్. స్వాతిలతో పాటు వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద యెత్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసారు.